క్లుప్తంగా

మాజీ సైనికుడి మృతి


ఎర్రప్ప(ఫైల్)

కర్నూలు(అర్బన్): నగరంలోని సీతారామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు వడ్డె ఎర్రప్ప(72) హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నర్రా పేరయ్య తెలిపారు. ఎర్రప్ప ఈఎంఈ కోర్‌లో సైనికుడిగా విధులు నిర్వహించారన్నారు. ఆయన కుటుంబానికి సంఘం కార్యదర్శి ఎం.సుధాకర్, కోశాధికారి నజీర్ అహమ్మద్ తదితరులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఉచిత మెడికల్ క్యాంపు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): అమీలియో హాస్పిటల్ సహకారంతో ఐద్వా ఆధ్వర్యంలో వీకర్ సెక్షన్ కాలనీలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. సుమారు 150 మందికి కంటి, బీపీ, ఈసీజీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఆపరేషన్ల కోసం రెఫర్ చేయగా మిగతా వారికి మందులను అందజేశారు.కార్యక్రమంలో వైద్యులు సుకన్య, స్వప్న, ఐద్వా మహిళలు అలివేలు, పద్మ, అనసూయ, సీపీఎం నాయకులు జమ్మన్న, గుర్రప్ప, కబీర్ పాల్గొన్నారు.

స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ తనిఖీ


యూపీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని స్టాంటన్‌పురం అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య తనిఖీ చేశారు. కేంద్రంలోని ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో యూపీఐ సెషన్‌లో పాల్గొని గర్భిణులకు అందుతున్న వైద్యసేవలు, ఎంసీపీ కార్డు, వైద్యపరీక్షల గురించి ఆరా తీశారు. గర్భిణులు, కిశోరబాలికలకు ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం మందులు, వైద్యపరీక్షల కిట్ల స్టాక్‌ను పరిశీలించారు.

ఈద్ మిలాప్ పోస్టర్ విడుదల


వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): ఈద్ మిలాప్ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మస్జీద్ ఏ మర్కజ్ ఇస్లామి అహ్లె హదీస్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఇలియాస్ బాషా కోరారు. బుధవారం స్థానిక వడ్డెగేరిలోని మసీదులో ఈద్ మిలాప్ కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12న సాయంత్ర 7 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో నిర్వహించే ఈద్ మిలాప్‌ను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ కార్యదర్శి అబ్దుల్ హమీద్, కోశాధికారి అబ్దుల్ అర్మన్ ఖాన్, సభ్యులు పాల్గొన్నారు.

అసభ్య పోస్టులపై చర్యలు తీసుకోండి


ఏఎస్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): ఖురాన్‌పైనా, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌పైనా సోషల్ మీడియాలో అసభ్య పోస్టుల పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. బుధవారం పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు కర్నూలు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బడి బయటి పిల్లలను గుర్తించండి

కర్నూలు (న్యూటౌన్): బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించాలని ఎంఈఓ విజయ భాస్కర్ తెలిపారు. బుధవారం జెడ్పీలోని కర్నూలు మండల పరిషత్ సమావేశ భవన్‌లో హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 – 18 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఆయా గ్రామాల్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటున్నారు, ఎంత మంది బడి బయట ఉన్నారో పూర్తి స్థాయిలో సర్వే చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కర్నూలు ఎంపీడీఓ ఎన్.భాస్కర్‌నాయుడు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సూపర్ ఉమెన్లు

- త్వరలో జగనన్న మహిళా మార్టులు
- జిల్లాలో నాలుగు మున్సిపాల్టీలు ఎంపిక
- రిలయన్స్, అమూల్, పీ అండ్ జీ కంపెనీలతో ఒప్పందం
- ప్రయోగాత్మకంగా కర్నూలులో ఈ నెలాఖరున ఏర్పాటు
- ఇప్పటికే 34 వేల గ్రూపు సభ్యుల నుంచి రూ.50 లక్షల సభ్యత్వం

కర్నూలు (టౌన్): పట్టణాల్లో కార్పొరేట్ సంస్థలకు ధీటుగా జగనన్న మహిళా మార్టుల పేరుతో సూపర్ మార్కెట్లు రానున్నాయి. ఇప్పటికే చిత్తూరు, కడప, విశాఖపట్నం, శ్రీకాకుళం, శ్రీకాళహస్తి వంటి పట్టణ ప్రాంతాల్లో జగనన్న మహిళా మార్టులు విజయవంతంగా నడుస్తున్నాయి. రాష్ట్రంలోనే వైఎస్సార్ జిల్లా పులివెందులలో అనతికాలంలోనే రూ.కోటి వ్యాపారంతో జగనన్న మహిళా మార్టులు రికార్డు సృష్టించాయి. పట్టణ మహిళలను ఆర్థికంగా మరింత వృద్ధి సాధించేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సక్సెస్ కావడంతో ఇప్పుడు అన్ని జిల్లాల్లో విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించారు. పట్టణాల్లోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటిని ఏర్పాటు చేయడం ద్వారా మహిళా గ్రూపులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. దీంతో పాటు గ్రూపు మహిళలకు అన్ని రకాల నిత్యావసర సరుకులు నాణ్యతతో పాటు మార్కెట్ ధరల కన్నా 3 శాతం తక్కువకు లభిస్తాయి. లాభాలు వస్తే డ్వాక్రా సంఘంలోని సభ్యులు పంచుకుంటారు. అవకాశం ఉంటే మరో సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది.

నాలుగు మున్సిపాల్టీలు ఎంపిక..

కర్నూలు కార్పొరేషన్‌తో పాటు ఎమ్మిగనూరు, డోన్, నంద్యాలలో ఏర్పాటు చేసేందుకు మెప్మా ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా జిల్లా కేంద్రం కర్నూలులో ప్రయోగాత్మకంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. కర్నూలు నగరంలోని మద్దూర్‌నగర్‌లో నగరపాలక సంస్థకు చెందిన మల్టీపర్పస్ కమ్యూనిటీ భవనం ఉంది. మెప్మా అధికారులు ఈ భవనాన్ని గుర్తించి సూపర్ మార్కెట్‌కు సర్వం సిద్ధం చేశారు. కాగా ప్రధాన రహదారి నుంచి నేరుగా సూపర్ మార్కెట్‌కు వెళ్లేందుకు రహదారి ఉన్నా... అది కాస్తా అన్యాక్రాంతం కావడంతో నగరపాలక అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని పూర్తి స్థాయి రహదారిని ఏర్పాటు చేసే పనుల్లో ఉన్నారు. ఇక కర్నూలు నగరంలో మొత్తం 7 వేలకు పైగా మహిళా గ్రూపులు ఉన్నాయి. 70 వేలకు పైగా ఉన్న ఈ గ్రూపుల నుంచి ఇప్పటికే 34 వేల మంది మహిళా మార్టుల ఏర్పాటుకు సంబంధించి సభ్యత్వం తీసుకున్నారు. ఒక్కో మహిళ రూ.150 ప్రకారం ప్రతి నెల పొదుపు చేస్తున్నారు. ఇప్పటికే రూ.50 లక్షలు ఫండ్ జగనన్న మహిళా మార్టు ఏర్పాటు చేసేందుకు సమకూర్చారు.


మద్దూరు నగర్‌లో ఏర్పాటు చేయనున్న జగనన్న మహిళా మార్టు భవనం

కార్పొరేట్ సంస్థలతో ఒప్పందం

జగనన్న మహిళా మార్టుల పేరుతో వస్తున్న సూపర్ మార్కెట్లు మార్కెట్‌లో లభించే ధరల కన్నా తక్కువగా అందిస్తాయి. నాణ్యమైన వస్తువులను ఉంచుతారు. దీంతో మెప్మా అధికారులు ఇప్పటికే రిలయన్స్, అమూల్, ప్రాక్టర్ అండ్ గ్యాంబల్ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. నిత్యావసర సరుకులు, పాల పదార్థాలు, డ్వాక్రా గ్రూపులు తయారు చేస్తున్న అన్ని రకాల వస్తువులు ఒకే చోట లభించడంతో పాటు తక్కువ ధరల్లో అందించనున్నారు. తద్వారా మంచి ఆదరణ లభించే అవకాశం ఉంది.

ఈనెలాఖరున ప్రారంభించేందుకు చర్యలు



జగనన్న మహిళా మార్టు జిల్లా కేంద్రం కర్నూలు నగరంలో ఈ నెలాఖరున ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మద్దూరు నగర్‌లోని నగర పాలక భవనాన్ని సిద్ధం చేశాం. అన్ని అనుమతులు వచ్చాయి. పొదుపు మహిళలను మరింత ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. కర్నూలు తర్వాత నంద్యాల, ఎమ్మిగనూరు, ఆదోని వంటి మున్సిపాల్టీల్లోనూ ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– నాగశివలీల, ప్రాజెక్టు డైరెక్టర్

టీఎల్ఎఫ్‌లచే ఎంపిక..

పట్టణ సమాఖ్యాలు (టౌన్ లెవల్ ఫెడరేషన్) జగనన్న మహిళా మార్టు ఎంపికలో కీలకంగా వ్యవహరిస్తాయి. కమిటీలో కిరణ్మయి (అధ్యక్షులు), కవిత (ఉపాధ్యక్షులు), రాధమ్మ (కార్యదర్శి), మహేశ్వరి (కోశాధికారి), కుళ్లాయమ్మ (సంయుక్త కార్యదర్శి) ఉన్నారు. వీరు చురుగ్గా ఉన్న మహిళా గ్రూపులు, సక్రమంగా పొదుపు చేయడం, తీసుకున్న రుణం నిర్ణీత సమయంలో చెల్లించడం, ఆర్థికంగా వృద్ధి సాధిస్తున్న మహిళా గ్రూపు సభ్యులనే ఎంపిక చేస్తారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఇతర మున్సిపాల్టీలలో అక్కడ ఉన్న టీఎల్ఎఫ్ సభ్యులే నిర్ణయం తీసుకుంటారు.

నేటి నుంచి విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు విద్యుత్ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీ.క్యాంప్ సెక్షన్ పరిధిలోని గణేష్ నగర్, మద్దూర్ నగర్, సి.క్యాంప్, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, సాయి వైభవ్ నగర్, నంద్యాల చెక్ పోస్టు, శేషాద్రీ నగర్, బృందావన్ నగర్, మారుతి నగర్, అరుంధతి నగర్, పాతబస్తీ సెక్షన్ పరిధిలోని జొహరాపురం, ఇందిరమ్మ గృహాలు, పాతబస్తీ, జొహరాపురం హౌసింగ్ బోర్డు, కర్నూలు రూరల్స్ సెక్షన్ పరిధిలోని మిలటరీ కాలనీ, గార్గేయపురం, దిగువపాడు, శివరాంపురం తదితర గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. అయితే అత్యవసరం ఉన్న చోట ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చర్యలు చేపడతామని, సాధ్యం కాని పక్షంలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేసు నమోదు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో నారా లోకేష్ పాదయాత్ర సమయంలో ఖురాన్‌ను అవమానించిన ఉమా గౌరీ శెట్టి, వెంకటసుబ్బారావు బీమినేనిపై కేసు నమోదు చేయాలని ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు జహంగీర్ అహ్మద్, నగర అధ్యక్షుడు హుస్సేన్ బుధవారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఖురాన్‌ను పట్టుకొని వస్తుండగా వారు తీవ్ర పదజాలంతో దూషించారని, రాజకీయాలు ఎలా ఉన్నా మతాల విశ్వాసాలను అవమానించడం తగదన్నారు.

నగరాభివృద్ధే ధ్యేయం


రాజ్‌విహార్ వద్ద అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): నగరాన్ని స్మార్ట్‌సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం నగరంలోని రాజ్ విహార్ సర్కిల్ నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రహదారిలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎమ్మెల్యే పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంట్లో కుర్చొని అభివృద్ధి జరగడం లేదని టీడీపీ నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నగరంలో మూడేళ్లలో రూ.కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కొండారెడ్డి బురుజు, పెద్దమార్కెట్, సంకల్ బాగ్, బిర్లాగేట్ వద్ద ఈట్ స్ట్రీట్ పేరుతో జరుగుతున్న అభివృద్ధి పనులు కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రూ.8 కోట్లతో పార్కులను తీర్చిదిద్దామని, పచ్చదనం పేరుతో పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను మున్సిపల్ సిబ్బందికి అప్పగించామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ మద్దయ్య, రైల్వే ప్రసాద్, సీతారం, పర్వేజ్‌ఖాన్, మహేష్, కేదార్ నాథ్, నవీన్, రాజేష్, పవన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఏ సమస్యలు వచ్చినా తనను కలిసి చెప్పి పరిష్కారం పొందవచ్చన్నారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టు, తాగునీరు తదితర సమస్యలపై తనను నేరుగా కలవవచ్చన్నారు.

'జగనన్నకు చెబుదాం'ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): వ్యక్తిగత సమస్యలున్న వారు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందనివారు, భూములు, ఇళ్లు ఇతర వ్యవహారాల్లో న్యాయం జరగని వారు టోల్ ఫ్రీ నంబర్ 1902కు ఫోన్ చేసి సమస్యను విన్నవించాలన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ ప్రతినిధి పంపే వైఎస్ఆర్(యువర్ సర్వీసు రిక్వెస్టు) ఐడీకి లింక్ అయిన ఫోన్‌కు ఎప్పటికప్పుడు సమాచారం వస్తుందన్నారు. సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉందనే సమాచారం అర్జీదారుడే స్పందన పోర్టల్‌లో లాగిన్ అయి కూడా తెలుసుకోవచ్చన్నారు. సమస్య పరిష్కారమై అర్జీదారుడు సంతృప్తి చెందినట్లు చెబితే ఆ సమస్య లాగిన్ నుంచి క్లోజ్ అవుతుందని, లేదంటే ముందు పరిష్కారం చేసిన అధికారిపై ఉన్న ఉన్నతాధికారి దగ్గర మళ్లీ రీ ఓపెన్ అవుతుందన్నారు. అప్పుడు ఆ అధికారి సమస్యను మరింత నిశితంగా విచారణ చేసి పరిష్కారం చూపాల్సి ఉంటుందన్నారు.

విస్తృత ప్రచారం కల్పించండి

జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని సచివాయాలు, మండల, డివిజన్ కార్యాలయాల్లో కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కోసం వాల్ పోస్టర్లు, మీడియాలో కథనాలు, సోషల్ మీడియాలో ఆడియో, వీడియో విజువల్స్ ద్వారా ప్రచారం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పది ఫలితాలపై అసంతృప్తి

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలపై తాను ఏ మాత్రం సంతృప్తిగా లేనని కలెక్టర్ అన్నారు. కొన్ని పాఠశాలల్లో జీరో శాతం ఫలితాలు రావడం తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. జిల్లాలో బడి బయట ఉన్న పిల్లల సంఖ్య ఎక్కువగా ఉందని, ముందుగా వారిని పాఠశాలలకు రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం పకడ్బందీ ప్రణాళికతో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచేందుకు చర్యలు తీసుకుంటానని ఆమె వివరించారు.

గుండెజబ్బు గర్భిణికి అరుదైన చికిత్స

కర్నూలు(హాస్పిటల్): గుండెజబ్బుతో బాధపడుతున్న గర్భిణికి వైద్యులు అరుదైన చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. కర్నూలులోని జెమ్ కేర్ కామినేని హాస్పిటల్‌లో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ బుధవారం వివరాలను వెల్లడించారు. ఆదోనికి చెందిన సంధ్య (23) గర్భం దాల్చగా ఆమెకు కవలలు జన్మిస్తారని స్థానిక వైద్యులు తెలిపారు. ఇదే సమయంలో ఆమెకు దగ్గు వస్తుండటంతో పరీక్ష చేసిన వైద్యులు గుండె పనితీరు తగ్గిందని, హైపర్ ట్రోఫిక్ కార్డియోమయోపతి అనే జబ్బు ఉందని తేల్చారు. నెలలు న నిండటంతో కామినేని ఆసుపత్రిలో చేరగా నొప్పి తెలియని ప్రసవం చేసి గుండె పనితీరుపై ఎలాంటి ఇబ్బంది కలగకుండా చేశారు. ప్రస్తుతం తల్లి, కవల పిల్లలు క్షేమంగా ఉన్నారని, వారిని డిశ్చార్జ్ చేశామని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో పవర్ లిఫ్టింగ్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్ విభాగంలో యశ్వంత్, శివాజీ, మహీంద్ర, శబరీష్, విజయ్‌కుమార్, రాజు, బాలికల విభాగంలో సాహితీ, దీపిక, సంగీత జూనియర్ విభాగంలో లక్ష్మీనరసింహ, హేమంత్‌కుమార్, మహేష్‌రావు, రోహిత్‌వర్మ, పల్లవి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20, 21 తేదీలలో గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించనున్న పవర్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ చాటి పతకాలు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ నటరాజరావు, పవర్ లిఫ్టింగ్ సంఘం కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం కావాలి


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవమయ్యేలా చూడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు ఇచ్చి ఎంసీపీ కార్డులో వివరాలు నమోదు చేసి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. దీనివల్ల పిల్లలను వ్యాధుల నుంచి కాపాడవచ్చన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి మూడు రోజుల ముందుగానే ఆస్పత్రిలో చేర్చి సుఖప్రసవం అయ్యేలా చూడాలని సూచించారు. ఆయన వెంట గార్గేయపురం ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

సుంకేసులకు 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు బుధవారం 350 క్యూసెక్కుల నీటి ఇన్ ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

ఆర్‌యూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక చంద్రరాజేశ్వరరావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో అనేక అవినీతి, ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడన్నారు. వీసీని రీకాల్ చేయాలని ఆందోళనలు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఉన్నతాధికారులైనా తక్షణమే స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు అడ్మిషన్స్ పేరుతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియను అడ్డుకునేందుకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, విద్యను కాషాయీకరణ, కార్పొరేటీకరణ చేసిందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఉపాధ్యక్షులు శరత్‌కుమార్, అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్ రాయలసీమ ద్రోహులు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య

కర్నూలు(అర్బన్): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ రాయలసీమ ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటిస్తే ... చంద్రబాబు, లోకేష్ కర్నూలుకు హైకోర్టు బెంచ్ పేరుతో మాయ మాటలు చెబుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న పథకాలను ప్రశ్నిస్తే ప్రజలు తిరగబడతారని, మంత్రులు, ఎమ్మెల్యేలను భూకబ్జాదారులంటూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుపై వైఖరి ఏమిటని లోకేష్‌ను ప్రశ్నించేందుకు వెళ్లే దళిత నాయకుడినని చూడకుండా తనను పోలీసులు నెట్టి వేయడం బాధాకరమన్నారు. సమావేశంలో నాయకులు అరుణ్, విజయ్, కర్ణ, అనిల్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

14న గోదా గోకులంలో హనుమజ్జయంతి వేడుకలు


ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న గోదా గోకులం సభ్యులు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగర శివారులోని గోదా గోకులంలో ఈనెల 14 హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త తెలిపారు. గురువారం గోదా గోకులంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వేడుకల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో గోదా గోకులం సభ్యులు మారం లలిత, ఇల్లూరి సింధు, పాలాది సునీత, చిత్రాల నాగజ్యోతి, పెరుమాళ్ల సునీత, మేడా సరిత, శ్యామల, శివ జ్యోతి, బాలసుధాకర్, మహేశ్వరరెడ్డి, పుల్లయ్య, వీరయ్య, శ్రీనాథ్, మాకం శ్రీనివాస్, పాలాది వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విత్తన ప్రాసెసింగ్ యూనిట్లపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వేరుశనగ, పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు ప్రాసెసింగ్ యూనిట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ప్రాసెసింగ్ యూనిట్ల ప్రత్యేక అధికారులతో మాట్లాడుతూ కర్నూలు, కల్లూరు మండలాల పరిధిలో 6 ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని, ప్రతి ప్రాసెసింగ్ యూనిట్‌కు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని తనిఖీ అధికారిగా నియమించామని తెలిపారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు వేరుశనగ, పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలను ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్)కు సరఫరా చేస్తాయని తెలిపారు. కావున నాణ్యత విషయంలో ఏఈఓలు, ఏఓలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాసెసింగ్ యూనిట్‌లోనే ఉండి మార్గదర్శకాల ప్రకారం ప్రాసెసింగ్ జరుగుతుందా.. 100 శాతం నాణ్యత పాటిస్తున్నారా అనే దానిని పాటించాలని పేర్కొన్నారు. ప్రతి లాట్ నుంచి ఒక సర్వీస్ శ్యాంపిల్ తీసి ఎమ్మిగనూరు విత్తన ధ్రువీకరణ ల్యాబ్‌కు పంపాలన్నారు. విత్తనాల్లో నాణ్యత లేకపోతే తనిఖీ అధికారులదే బాధ్యత వహించాలన్నారు. కర్నూలు, కల్లూరు ఏఓలు తమ పరిధిలోని ప్రాసెసింగ్ యూనిట్లను పర్యవేక్షిస్తారని తెలిపారు. సమావేశంలో కల్లూరు, కర్నూలు మండల వ్యవసాయ అధికారులు శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


బాలాజీ నగర్‌లో మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం 39వ వార్డు బాలాజీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాలనీకి విచ్చేసిన ఆయనకు స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. అనంతరం ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో వర్తించిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులను కోరారు. ఈ సందర్భంగా పలువురు ప్రస్తావించిన సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. గతంలో సంక్షేమ పథకాలు లోభూయిష్టంగా, అవినీతి, అక్రమాలకు నిలయంగా మారాయని, అర్హులకు కాకుండా నాయకుల అనుచరులు, అనుకూలురుకు మాత్రమే వర్తించేవని ఆరోపించారు. ప్రస్తుతం జగనన్న పాలనలో పారదర్శకంగా.. కేవలం అర్హతే ప్రామాణికంగా, ఇంటి వద్దకే వచ్చి పథకాలు అందజేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రజలు పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామ/వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందించే సేవల విషయంలో అలసత్వం వహించవద్దని అధికారులు, సిబ్బందికి సూచించారు. సచివాలయ కన్వీనర్లు కరీముల్లా, ముజమ్మిల్, బాబయ్య, అనీస్, మౌలాలి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.